క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

సైదాబాద్: చెట్ల కొమ్మల తొలగింపు, పలు మరమ్మతు పనుల కారణంగా బుధవారం ఆస్మాన్‌ఘడ్ ట్రాన్స్‌కో డివిజన్ పరిధిలోని కింది తెలిపిన ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని డీఈ హన్మంత్‌రావు తెలిపారు.

- ఉదయం 8 నుంచి 11 గంటల వరకు..

ఎంఆర్‌ఓ ఆఫీస్, వీఎస్‌రెడ్డి నగర్, గ్యాస్ కంపెనీ, హెగ్డే నర్సింగ్ హోం, ఆర్‌టీఏ ఆఫీస్, మూసారాంబాగ్ రోడ్, భారత్ పెట్రోల్ పంప్, వివేకానంద స్కూల్, మోర్ మార్కెట్ పరిసర ప్రాంతాలు.

- ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు...

గణేష్ టెంపుల్, సలీంనగర్, హీరోహోండా షోరూం వెనుక వైపు, రామాలయం స్ట్రీట్, రామచంద్రా ఐటీఐ, ఇంద్రసేనారెడ్డి పీటీ, శ్రీపురం కాలనీ రోడ్ పరిసర ప్రాంతాలు.

- మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు...

గురుదాస్, సలీంనగర్, రామారావ్ కంపెనీ, సలీంనగర్ మిల్క్‌బూత్ డౌన్, పద్మావతి అపార్ట్స్, సలీంనగర్ గణేష్ టెంపుల్ పరిసర ప్రాంతాలలో కరెంట్ ఉండదని డీఈ తెలిపారు.

రైతుబజార్లలో కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతుబజార్లలో కూరగాయల ధరలు... (కిలో... రూపాయల్లో) టమాటా 75, వంకాయ 28, బెండ 35, పచ్చిమిర్చి 90, కాకర 35, బీర 28, క్యాబేజీ 15, ఫ్రెంచి బీన్స్ 55–95, క్యారెట్ 47, దొండ 13–18, చిక్కుడు 65, గోకర 28, బీట్‌రూట్ 30, క్యాప్సికం 80, ఆలు 20, దోస 23, సొర 13, పొట్ల 13, ఉల్లిగడ్డ 20, చామగడ్డ 37. ఈ ధరలు బుధవారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

నేడు బీజేపీ నాయకుల టిఫిన్‌బాక్స్ బైఠక్

సైదాబాద్: డివిజన్ పరిధిలోని జీఏకాలనీలో బుధవారం మలక్‌పేట నియోజకవర్గ బీజేపీ నాయకులు, కార్యకర్తలతో టిఫిన్‌బాక్స్ బైఠక్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు బీజేపీ భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు సంరెడ్డి సురేందర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం సైదాబాద్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, పార్టీ జాతీయ నాయకత్వం ఇచ్చిన పిలుపు మేరకు ఈ కార్యక్రమం చేపడుతున్నామన్నారు. జీఏ కాలనీలోని శ్రీనివాస కమ్యూనిటీహాల్‌లో నిర్వహించనున్న టిఫిన్ బాక్స్ బైఠక్‌కు మాజీ ఎమ్మెల్యే ఎస్.ఇంద్రసేనారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరవుతారని తెలిపారు. నాయకులు, కార్యకర్తలు తమ ఇళ్ల నుంచే టిఫిన్ బాక్స్‌లు తెచ్చుకొని ఇష్టాగోష్ఠిగా చర్చించుకుంటారని ఆయన వివరించారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గ బీజేపీ నాయకులు, కార్యకర్తలు విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ఎల్‌బీనగర్ సర్కిల్‌కు కొత్త డీసీలు

ఎల్‌బీనగర్: ఎల్‌బీనగర్ సర్కిల్ పరిధిలో ఇద్దరు డీసీలు బదిలీ అయ్యారు. హయత్‌నగర్–3 డీసీగా పనిచేస్తున్న మారుతీ దివాకర్ అంబర్‌పేటకు బదిలీ కాగా, సరూర్‌నగర్–5 డీసీగా పనిచేస్తున్న కృష్ణయ్య కూకట్‌పల్లికి బదిలీ అయ్యారు. ఎల్‌బీనగర్–4 డీసీ సురేందర్‌రెడ్డి ఇటీవలే బదిలీపై వెళ్లిన సంగతి తెలిసిందే. కాగా వీరి స్థానంలో కూకట్‌పల్లి డీసీగా పనిచేస్తున్న రవీందర్‌కుమార్ హయత్‌నగర్ డీసీగా, ఉప్పల్‌లో డీసీగా పనిచేస్తున్న అరుణ కుమారి సరూర్‌నగర్ డీసీగా, సికింద్రాబాద్ డీసీగా పనిచేస్తున్న దశరథ ఎల్‌బీనగర్ డీసీగా బదిలీ చేశారు. వీరు చార్జి తీసుకోవాల్సి ఉంది.

రైతుల కష్టం కాంగ్రెస్‌కే తెలుసు

మేయర్ చిగురింత పారిజాత

బడంగ్‌పేట్: రైతుల కష్టం కాంగ్రెస్ పార్టీకే తెలుసని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, బడంగ్‌పేట మేయర్ చిగురింత పారిజాత అన్నారు. ఏఐసీసీ నేత రాహుల్‌గాంధీపై ముఖ్యమంత్రి కేసీఆర్ చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా పారిజాత మాట్లాడుతూ తెలంగాణ ఇచ్చిన వ్యక్తుల పట్ల అగౌరపరిచేలా మట్లాడటం సరికాదన్నారు. కేసీఆర్, మంత్రి కేటీఆర్ నోరు అదుపులో పెట్టుకోవాలని హెచ్చరించారు. కార్యక్రమంలో ఫ్లోర్ లీడర్ వంగేటి ప్రభాకర్ రెడ్డి, కార్పొరేటర్లు రాళ్లగూడం సంతోషి, సుధర్శన్‌రెడ్డి, బండారి మనోహర్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుభాన్‌యాదవ్, మహిళా అధ్యక్షురాలు అమృత, బాల్‌నింగని జంగయ్య, ఆనంద్‌రెడ్డి, గట్టు బాలకృష్ణ, గుర్రం లక్ష్మారెడ్డి, మనోహర్, బంగారి అశోక్ పాల్గొన్నారు.

యువతి అదృశ్యం



అంకిత (ఫైల్)

పహాడీషరీఫ్: ఇంటినుంచి బయటకు వెళ్లిన యువతి అదృశ్యమైన ఘటన పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రావిరాల హౌసింగ్ బోర్డుకు చెందిన కాంటేకార్ మహేష్ కుమార్తె అంకిత(23) ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తోంది. అయితే రెండు రోజులుగా యువతి కుటుంబసభ్యులతో మాట్లాడకపోవడంతో ఈ నెల 17న తల్లి మందలించింది. దీంతో అదేరోజు రాత్రి 10.30 గంటల సమయంలో ఎవరికీ చెప్పకుండా బయటికి వెళ్లింది. అప్పటి నుంచి ఆమె కనిపించకపోవడంతో తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

కొత్త పోలీసు స్టేషన్‌తో ప్రజలకు మరింత భద్రత

- ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి
- నాగోలులో నూతన ఠాణాను ప్రారంభించిన ఎమ్మెల్యే, కమిషనర్ డీఎస్ చౌహాన్



నాగోలు నూతన పోలీస్ స్టేషన్ రిసెప్షన్‌లో మాట్లాడుతున్న సీపీ చౌహాన్, ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

నాగోలు: ప్రజలకు మరింత భద్రత కల్పించేందుకు, శాంతి భద్రతల పరిరక్షణ కోసం నూతన పోలీస్ స్టేషన్ అందుబాటులోకి తీసుకొచ్చామని ఎల్‌బీ నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి తెలిపారు. మమతానగర్‌లో ఏర్పాటు చేసిన నాగోలు నూతన పోలీస్ స్టేషన్‌ను మంగళవారం ఆయన రాచకొండ పోలీస్ కమిషనర్ డీఎస్ చౌహాన్, జాయింట్ సీపీ సత్యనారాయణ, ఎల్‌బీనగర్ డీసీపీ సాయిశ్రీ, నాగోలు డివిజన్ కార్పొరేటర్ చింతల అరుణాసురేందర్ యాదవ్‌తో కలిసి ప్రారంభించారు.

- ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ, అందరికీ ఉపయోగపడే పోలీస్‌స్టేషన్‌కు భవనం ఇచ్చిన నాగోలు నవ చైతన్య యువజన సంఘం సభ్యులను అభినందించారు. త్వరలోనే అన్ని హంగులతో నాగోలు పోలీస్ స్టేషన్ నూతన భవనాన్ని మరో చోట నిర్మించి ఇస్తామన్నారు. నవ చైతన్య యువజన సంఘ సభ్యుల కోసం మరో అంతస్తు నిర్మిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.
- రాచకొండ పోలీస్ కమిషనర్ డీఎస్ చౌహాన్ మాట్లాడుతూ, నాగోలు ప్రాంతం అభివృద్ధి చెందుతోందని, ఎమ్మెల్యే ప్రత్యేక చొరవ తీసుకొని ఇక్కడ పోలీస్ స్టేషన్ ఏర్పాటుకు కృషి చేశారని తెలిపారు. రాచకొండ పోలీస్ కమిషనరేట్ పరిధిలో శాంతి భద్రతలను అదుపులో ఉంచడానికి పోలీసులు శక్తి వంచన లేకుండా పని చేస్తున్నారన్నారు. నాగోలు ప్రాంతంలో నూతన ఠాణా ఏర్పాటుతో ఈ ప్రాంతంలో ప్రజలకు మరింత భద్రత పెరుగుతుందని తెలిపారు. పోలీస్ స్టేషన్ కోసం సహకరించిన నవ చైతన్య యువజన సంఘం నాయకులను, బిల్డర్ శ్రీకాంత్‌ను కమిషర్ అభినందిచారు.
- ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ ఆవరణంలో హరితహారం కార్యక్రమం నిర్వహించి మొక్కలు నాటారు.కార్యక్రమంలో ఎల్‌బీనగర్ ఏసీపీ శ్రీధర్‌రెడ్డి, నాగోలు పోలీస్ స్టేషన్ సీఐ వెంకటేశ్వర్లు, ఎల్‌బీనగర్ పోలీస్ స్టేషన్ సీఐ అంజిరెడ్డి, పోలీస్ స్టేషన్ ఎస్‌ఐలు, బీఆర్ఎస్ నాయకులు అనంతుల రాజిరెడ్డి, తూర్పాటి చిరంజీవి, నవ చైతన్య యువజన సంఘం అధ్యక్షుడు చెర్కు ప్రవీణ్‌గౌడ్, కార్యదర్శి ఇంద్రాల స్వాతిన్‌గౌడ్, కోశాధికారి మధుసూదన్, పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

డీసీపీ నూతన కార్యాలయం ప్రారంభం

ఎల్‌బీనగర్ డీసీపీ నూతన కార్యాలయం పై అంతస్తును రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్ మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమంలో రాచకొండ జాయింట్ సీపీ సత్యనారాయణ, ఎల్‌బీనగర్ డీసీపీ సాయిశ్రీ పాల్గొన్నారు.



నూతన డీసీపీ కార్యాలయంలో సంతకం చేస్తున్న సీపీ చౌహాన్

బోనాలు తెలంగాణ సంస్కృతికి ప్రతీకలు



జయదుర్గాదేవిని దర్శించుకున్న హోంమంత్రి మహమూద్ అలీ తదితరులు

సైదాబాద్: బోనాల ఉత్సవాలు తెలంగాణ సంస్కృతికి ప్రతీకలని హోంమంత్రి మహమూద్ అలీ అన్నారు. సైదాబాద్ డివిజన్ పూసలబస్తీలోని జీవనజ్యోతి సంఘంలో కొలువుదీరిన జయదుర్గా అమ్మవారిని మాజీ ఎంపీ మంద జగన్నాథంతో కలిసి ఆయన దర్శించుకున్నారు. ఆలయ నిర్వాహకుడు, హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ కొరుడు భూమేష్ ఇరువురినీ శాలువాలతో సత్కరించారు. అనంతరం అమ్మవారి ఘటాల ఊరేగింపు పోతరాజుల విన్యాసాలు, డప్పు వాయిద్యాలు, యువకుల నృత్యాలతో సైదాబాద్ పురవీధుల్లో సందడిగా సాగింది.

ప్రధాన సమస్యలు ఒక్కొక్కటిగా పరిష్కారం



ఎస్ఎన్‌డీపీ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

లింగోజిగూడ: నియోజకవర్గంలోని ప్రధాన సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కారం అవుతున్నాయని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. గతంలో అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో బాక్స్ డ్రెయిన్ పనులు జరుగుతున్న తీరుపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిలో భాగంగా లింగోజిగూడ డివిజన్ శ్రీరాంనగర్‌లో జరుగుతున్న ఎస్ఎన్‌డీపీ పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ, ఈ పనులు పూర్తయితే వరద ముంపు సమస్యలు పూర్తి స్థాయిలో పరిష్కారమవుతాయన్నారు. అభివృద్ధి పనులతో ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా రక్షణ చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో నాయకులు నాయకులు ముద్ద కల్యాణ్, చీర తిరుమలేష్, చంద్రశేఖర్, సాయిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

‘డబుల్’ ఇళ్ల పేరుతో బీఆర్ఎస్ కొత్త నాటకం: సామ



వాంబే కాలనీలో మాట్లాడుతున్న సామ రంగారెడ్డి

మన్సూరాబాద్: నియోజకవర్గంలో డబుల్‌బెడ్ రూమ్ ఇళ్లకు వేల మంది దరఖాస్తులు చేసుకుంటే నిర్మించింది మాత్రం వందల్లోనే అని, ఎన్నికల వేళ డబుల్ ఇళ్ల దరఖాస్తుదారులకు ఫోన్ చేసి దరఖాస్తులను పరిశీలిస్తున్నామంటూ కొత్త డ్రామాకు బీఆర్ఎస్ ప్రభుత్వం తెరలేపిందని బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి ఆరోపించారు. ఇంటింటికీ బీజేపీ కార్యక్రమంలో భాగంగా ఆయన మంగళవారం నాగోలు డివిజన్ పరిధిలోని వాంబేకాలనీ, కుమ్మరి బస్తీ, డబుల్ బెడ్‌రూమ్‌ల సముదాయాలు, సాయిసప్తగిరి కాలనీల్లో మాజీ ఎంపీ చాడ సురేష్‌రెడ్డి, కార్పొరేటర్ చింతల అరుణాసురేందర్‌యాదవ్‌తో కలిసి పాదయాత్ర చేశారు. ప్రజలను వారు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సామ రంగారెడ్డి మాట్లాడుతూ, బీఆర్ఎస్ ప్రభుత్వం మోసపూరిత పాలనతో ప్రజలను మోసం చేస్తోందన్నారు. 2014లో ఎరుకల నాంచరమ్మ బస్తీలో డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్లను ప్రారంభించి. 2018లో కేవలం 288 ఇళ్లను మాత్రమే పూర్తి చేసిందన్నారు. అందులో 216 ఇళ్లను లబ్ధిదారులకు కేటాయించారన్నారు. ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి బీబ్లాక్‌లోని ఇళ్లను తన అనుచరులు, పీఏలకు కట్టబెట్టారని, వాళ్లు ఇతరులకు ఒక్కొక్కటి రూ.20 లక్షల చొప్పున అమ్ముకున్నారన్నారు. ప్రధానమంత్రి ఆవాస్‌యోజన కింద ఇళ్ల నిర్మాణానికి కేంద్రంప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని, రాష్ట్ర ప్రభుత్వం తన వాటాను కలుపకపోవటంతో నిధులు వెనక్కి వెళ్లిపోయాయన్నారు. కార్యక్రమంలో నాయకులు చింతల సురేందర్‌యాదవ్, బద్దం బాలకృష్ణగౌడ్, వినోద్‌రెడ్డి, సాయికుమారి, సంజీవరెడ్డి, నరేందర్ రెడ్డి, లయ కలంశెట్టి, చంద్రశేఖర్‌గుప్తా, ప్రభాకర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

రాజకీయాలపై ఆసక్తిని పెంచుకోవాలి



హయత్‌నగర్: విద్యార్థి నాయకులతో అతిథులు

హయత్‌నగర్: పాఠ్యాంశాలపైనే కాకుండా సామాజిక రాజకీయ అంశాలపై కూడా విద్యార్థులు ఆసక్తిని పెంచుకోవాలని, విద్యార్థుల నుంచే భావి నాయకులు ఉద్భవిస్తారని హయత్‌నగర్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం హయత్‌నగర్‌లోని రవీంద్ర భారతి పాఠశాలలో జరిగిన విద్యార్థి నాయకుల ఎన్నికలకు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ... కొత్త తరం యువత రాజకీయాలపై దృష్టి పెట్టాలని, కేవలం ఉద్యోగాలు సంపాదించే చదువులే కాకుండా మంచి నాయకులుగా విద్యార్థులు ఎదగాలని అన్నారు. విద్యార్థి నాయకులుగా ఎన్నికైన విద్యార్థులకు ఆయన బ్యాడ్జీలు బహూకరించారు. ఎస్ సూర్య పాఠశాల డీన్ పి.శ్రీదేవి, డీఐ రాజేష్, పాల్గొన్నారు.

వనస్థలిపురం: వనస్థలిపురంలోని రవీంద్ర భారతి పాఠశాలలో నిర్వహించిన విద్యార్థి నాయకుల ఎన్నిక (ఇన్వెస్టిట్యూర్ సెర్మనీ)లకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎస్ఐ పరమేష్‌తో కలసి ఆయన విద్యార్థులకు బ్యాడ్జీలు అందజేశారు. పాఠశాల ప్రిన్సిపాల్ కిరణ్ అగర్వాల్ తదితరులు పాల్గొన్నారు.

చైతన్యపురి: రవీంద్రభారతి పాఠశాల చైతన్యపురి బ్రాంచిలో నిర్వహించిన ఇన్వెస్టిట్యూర్ కార్యక్రమంలో ఎన్‌సీసీ నావెల్ యూనిట్ అధికారి రామకృష్ణ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ప్రిన్సిపాల్ బ్యూలా తదితరులు పాల్గొన్నారు.

నగరంలో వీరన్న విగ్రహం ఏర్పాటు చేయాలి

ఎల్‌బీనగర్: మలి దశ ఉద్యమ సిద్ధాంతకర్త, దళిత బహుజన ప్రజా ఉద్యమకర్త మారోజు వీరన్న విగ్రహాన్ని హైదరాబాద్‌లో ఏర్పాటు చేయాలని ప్రజాబంధు ఆర్గనైజేషన్ వ్యవస్థాపకుడు సంతోష్ డిమాండ్ చేశారు. మంగళవారం ఎల్‌బీనగర్‌లో ఆ యన విలేకరులతో మాట్లాడుతూ, వీరన్న తన ప్రా ణాలను సైతం లెక్క చేయకుండా అగ్రకుల రాజ్యానికి ఎదురెళ్లి ప్రజా పోరాటాన్ని నడిపించారని గుర్తుచేశారు. దళిత, బహుజనుల రాజ్యం కావాలని ‘మేమెంతో మాకంతే వాటా’ అనే నినాదాన్ని పార్లమెంట్ వరకు తీసుకెళ్లారని తెలిపారు. వెంటను వీరన్న విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని, విగ్రహా ఏర్పాటుకు అన్ని కులాల నుంచి మద్దతు ఉందన్నారు. కార్యక్రమంలో నాయకులు రాయపురం వెంకటేశ్వర్లు నరేష్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలి



కాలనీలో పర్యటిస్తున్న కార్పొరేటర్ సుజాతానాయక్

హస్తినాపురం: డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాలలో జరుగుతున్న అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని హస్తినాపురం కార్పొరేటర్ బానోతు సుజాతానాయక్ అన్నారు. డివిజన్‌లోని శ్రీరామనగర్ కాలనీలో మంగళవారం ఆమె కాలనీ వాసులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యల పరిష్కారానికి అన్ని విధాలా చర్యలు తీసుకుంటామన్నారు. కాలనీ ప్రతినిధులు దశరథరామిరెడ్డి, నాయకులు గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

నిజాయితీ చాటుకున్న హోంగార్డ్



సెల్‌ఫోన్‌ను బాధితుడికి అందజేస్తున్న సీఐ

నాగోలు: రోడ్డుపై దొరికిన విలువైన సెల్‌ఫోన్‌ను బాధితుడికి అప్పగించి తనలోని నిజాయితీని చాటుకున్నాడో హోంగార్డ్. వివరాలు... రాచకొండ పోలీస్ కమిషనర్ క్యాంప్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న హోంగార్డ్ లక్ష్మణ్‌గౌడ్ మంగళవారం ఉదయం జైపురి కాలనీ నుంచి డ్యూటీకి వస్తుండగా.. రోడ్డుపై రూ. 25 వేల విలువైన సెల్‌ఫోన్ దొరికింది. అతను ఆ ఫోన్‌ను ఎల్‌బీనగర్ సీఐ అంజిరెడ్డికి అప్పగించాడు. ఫోన్ యజమానిని గుర్తించిన సీఐ స్టేషన్‌కు పిలిచి అప్పగించారు. ఎస్ఐ నాగరాజు, హోంగార్డ్ లక్ష్మణ్ పాల్గొన్నారు.

వర్షానికి విద్యుత్ తీగలపై కూలిన చెట్టు



మరమ్మతు పనులను పర్యవేక్షిస్తున్న కార్పొరేటర్

సైదాబాద్: వర్షానికి చెట్టు కూలి విద్యుత్ తీగలపై పడిన ఘటన సైదాబాద్ డివిజన్ ఇంద్రప్రస్థ కాలనీలో జరిగింది. స్థానికుల కథనం ప్రకారం... మంగళవారం తెల్లవారుజాము నుంచి కురుస్తున్న వర్షానికి ఇంద్రప్రస్థ కాలనీలో పార్క్ సమీపంలోని ఓ చెట్టు కరెంట్ తీగలపై పడింది. స్థానికుల ద్వారా ఈ విషయం తెలుసుకున్న కార్పొరేటర్ కొత్తకాపు అరుణారవీందర్‌రెడ్డి ఘటనాస్థలానికి చేరుకున్నారు. వెంటనే ట్రాన్స్‌కో, హార్టికల్చర్ అధికారులు, డీఆర్‌ఎఫ్ టీంను పిలిపించారు. ట్రాన్స్‌కో సిబ్బంది చేపట్టిన మరమ్మతులను అక్కడే ఉండి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, వర్షాకాలంలో అందరూ తగిన రక్షణ చర్యలు పాటించాలన్నారు. కార్యక్రమంలో ట్రాన్స్‌కో ఏఈ సత్యనారాయణ, శ్రీకాంత్, మీర్జా, మహమూద్ పాల్గొన్నారు.

బీసీలను ఓటు బ్యాంకుగా మార్చడం దురదృష్టకరం



రౌండ్‌టేబుల్ సమావేశంలో పాల్గొన్న బీసీ కుల సంఘాల ఐక్య వేదిక నాయకులు

బీసీ కుల సంఘాల ఐక్య వేదిక నాయకులు

మన్సూరాబాద్: బలమైన నిస్వార్థ నాయకత్వం లేకపోవడం, బీసీ ఓట్లతో లబ్ధి పొందిన బీసీ నాయకులు కూడా నాయకత్వాన్ని పెంపొందించకపోవడంతో రాజకీయంగా బీసీలు ఎదగలేకపోతున్నారని బీసీ కుల సంఘాల ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు కాటం నర్సింహ్మాయాదవ్, ప్రముఖ బీసీ నేత కటకం నర్సింగ్‌రావు అభిప్రాయపడ్డారు. బీసీ కుల సంఘాల ఐక్య వేదిక తెలంగాణ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో ‘ రాజ్యాధికారం.. బీసీల చైతన్యం’ అనే అంశంపై నాగోలు డివిజన్ బాలాజీనగర్ కాలనీలోని స్వకులశాలి భవన్‌లో మంగళవారం రౌండ్‌టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన వారు మాట్లాడుతూ, సామాజిక సేవలో, పార్టీల జెండాలు మోయడంలో ముందుటున్న బీసీలను ఎన్నికల సమయంలో కేవలం ఓటుబ్యాంకుగా మార్చడం దురదృష్టకరమన్నారు. బీసీలను చైతన్యపర్చేందుకు, బీసీల సత్తా చాటడానికి ప్రయోగాత్మకంగా ఎల్‌బీనగర్ నియోజకవర్గం నుంచి బీసీ పోరాటం మొదలు కావాలని సమావేశంలో ఏకాభిప్రాయం వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని రాజకీయపార్టీలన్నీ బేషరుతుగా 60 సీట్లను బీసీలకే కేటాయించాలని, బీసీలకే ముఖ్యమంత్రి పదవి అని ప్రకటించాలని డిమాండ్ చేశారు. నాయకులు తుర్క నర్సింహ, దొమ్మాట వెంకటేష్, చామకూర రాజు, వంటెద్దు నరేందర్, బొమ్మ రఘురాంనేత, చిగుమల్ల బాలప్రకాష్, కాటం శ్రీకాంత్ యాదవ్, గుండ్ల ఆంజనేయులుగౌడ్, సిలివేరు శంకర్, అనిత తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో బీటెక్ విద్యార్థి ఆత్మహత్య



పవన్ (ఫైల్)

చైతన్యపురి: అనారోగ్యంతో బాధపడుతున్న ఓ యువకుడు మనస్తాపంతో లాడ్జిలో ఆత్మహత్య చేసుకున్న ఘటన సరూర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది.ఎస్ఐ లక్ష్మయ్య కథనం ప్రకారం... మహబూబ్‌నగర్‌కు చెందిన పవన్ (23) బీటెక్ చదువుతున్నాడు. తండ్రి దశరథ చనిపోయాడు. పోటీ పరీక్షలు రాసేందుకు వెళ్తున్నానని తల్లి తిరుపతమ్మకు చెప్పి సోమవారం హైదరాబాద్ వచ్చాడు. దిల్‌సుఖ్‌నగర్ మెట్రోస్టేషన్ పక్కన ఉన్న ఓయో హోటల్‌లో గది అద్దెకు తీసుకున్నాడు. మంగళవారం పవన్ బయటకు రాకపోవటంతో హోటల్ సిబ్బంది రూం లాక్ సందులో నుంచి లోపలికి చూడగా ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించాడు. పోలీసులకు సమాచారం ఇవ్వగా ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించి మృతుడు తల్లికి సమాచారం ఇచ్చారు.

అనారోగ్యం తట్టుకోలేకే....

“ నాకు కొంత కాలంగా బ్లడ్ వామ్టింగ్స్ అవుతున్నాయి. ఎవరికీ చెప్పుకోలేను.నాచావుకు ఎవరూ కారణం కాదు’’ .. అంటూ పవన్ రాసిన సూసైడ్ నోట్ ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అనారోగ్యం వల్ల మనస్తాపానికి గురై బలవన్మరణానికి పాల్పడి ఉండవచ్చని పోలీసులు భావిన్నారు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ లక్ష్మయ్య తెలిపారు.

ఘనంగా ఫలహారం బండ్ల ఊరేగింపు



పల్టాన్‌లో.. టీపీసీసీ కార్యదర్శి బాలకృష్ణయాదవ్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వంజరి వినోద్



జనప్రియ కాలనీలో ఫలహారం బండి ఊరిగేంపులో సామ రంగారెడ్డి, కార్పొరేటర్ పవన్‌కుమార్

మలక్‌పేట: అక్బర్‌బాగ్, మూసారంబాగ్ డివిజన్లలో సోమవారం రాత్రి ఫలహారం బండ్లు, తొట్టెల ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. డప్పు చప్పుళ్లు, శివసత్తులు, పోతురాజు విన్యాసాలతో ఊరేగింపు సందడిగా జరిగింది. భక్తులు అమ్మవారికి ఘటాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అక్బర్‌బాగ్‌లో బీజేపీ డివిజన్ అధ్యక్షుడు నరేష్‌యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన ఘటాల ఊగింపులో..కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి, బీజేపీ నేతలు వనపర్తి రమేష్ గుప్తా, ఎల్‌బీ శాస్త్రి, పల్టాన్‌లో జరిగిన తొట్టెల ఊరేగింపులో.. టీపీసీసీ కార్యదర్శి బాలకృష్ణయాదవ్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వంజరి వినోద్, మూసారంబాగ్‌లో బీజేపీ నగర నాయకుడు చందు ముదిరాజ్ ఆధ్వర్యంలో జరిగిన ఉత్సవాల్లో ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాణిరుద్రమ, కార్పొరేటర్ భాగ్యలక్ష్మి, ప్రశాంత్ పాల్గొన్నారు.

జనప్రియ కాలనీలో ...

నాగోలు: కొత్తపేట డివిజన్ జనప్రియ కాలనీలో బోనాల ఉత్సవాల సందర్భంగా అశ్విన్ సింగ్ ఆధ్వర్యంలో సోమవారం రాత్రి ఫలహారం బండి ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి, కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్ కుమార్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. నాయకులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

ఆర్‌కేపురంలో...

దిల్‌సుఖ్‌నగర్: రామకృష్ణాపురం డివిజన్ వాస్తు కాలనీలోని మల్ల మైసమ్మ తల్లి ఆలయంలో ఫలహారం బండి ఊరేగింపు సోమవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు దేపభాస్కర్‌రెడ్డి, రాష్ట్ర యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు చిలుక ఉపేందర్ రెడ్డి , గట్ల రవీంద్ర పాల్గొన్నారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు కల్యాణ్ యాదవ్, సురేష్, మచుకూరి రాజు, భవానీ, రవి, ప్రసాద్, ప్రసాద్, మల్లేష్, చరణ్ తదితరులు పాల్గొన్నారు.



వాస్తు కాలనీలో .. దేపభాస్కర్‌రెడ్డి, చిలుక ఉపేందర్‌రెడ్డి తదితరులు



అక్బర్‌బాగ్‌లో తొట్టెల ఊరేగింపులో... బీజేపీ నాయకులు



మూసారంబాగ్‌లో రాణి రుద్రమను సన్మానిస్తున్న కార్పొరేటర్ భాగ్యలక్ష్మి

వర్షంలో బైక్ స్కిడ్.. తీవ్రగాయాలతో యువకుడి మృతి

చైతన్యపురి: వర్షంలో వెళ్తుండగా బైక్ స్కిడ్ అయి కిందపడటంతో తీవ్రగాయాలై ఒక యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన సరూర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ శ్రీనివాసులు తెలిపిన వివరాల ప్రకారం... కర్మన్‌ఘాట్ గాయత్రినగర్‌కు చెందిన పాలకొమ్ము సురేందర్(20) పాన్‌షాప్‌లో పని చేస్తున్నాడు. సోమవారం రాత్రి ఒంటిగంట సమయంలో దిల్‌సుఖ్‌నగర్ నుంచి బైక్‌పై గాయత్రినగర్‌కు బయలుదేరాడు. మార్గం మధ్యలో కర్మన్‌ఘాట్ శుభం హోటల్ సమీపంలో వర్షం కారణంగా బైక్ స్కిడ్ అయింది. దీంతో కింద పడ్డ సురేందర్ తలకు తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్ట్‌మార్టం కోసం తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బార్‌లో బీర్ బాటిళ్లతో పరస్పర దాడులు

సైదాబాద్: బార్‌లో మద్యం తాగుతూ రెండు గ్రూపుల వారు బీర్ బాటిళ్లతో పరస్పర దాడులకు పాల్పడ్డారు. సైదాబాద్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... చంపాపేటకు చెందిన జంగారెడ్డి (48) తన స్నేహితులు సంతోష్‌కుమార్, మోహన్‌రెడ్డిలతో కలిసి సోమవారం సాయంత్రం సాగర్ హైవేపై ఉన్న బార్‌కు వెళ్లాడు. అదే బార్‌కు సైదాబాద్‌కు చెందిన దీపక్‌కుమార్ (26) తన స్నేహితులు అరవింద్‌కుమార్, అవినాష్‌లతో కలిసి వెళ్లాడు. బార్‌లో మద్యం తాగుతూ రెండు వర్గాల వారు అకారణంగా గొడవపడ్డారు. బాటిళ్లతో పరస్పరం దాడి చేసుకున్నారు. జంగారెడ్డికి ముఖంపై, ఎడమ భుజంపై గాయాలయ్యాయి. దీపక్, అరవింద్‌లకు సైతం తల, భుజాలకు గాయాలయ్యాయి. ఇరువర్గాల ఫిర్యాదులతో సైదాబాద్ పోలీసులు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.